# ఏదీ గతి నాకూ?

నేను కూడా అందరి లాగే జన్మించాను.

ప్రతివారి పుట్టుకకూ ఓ అర్థం వుండాలన్న నియమం ఏమీ లేదు. అయితే నా పుట్టుకకు ఓ ప్రత్యేకత వున్నది. నా జన్మ వెనుక ఓ పర్పస్ వున్నది.

భార్య భర్తలను దూరం చెయ్యడం నా ఉద్దేశ్యం కాదు, లక్ష్యం అంతకన్నా కాదు. భార్యాభర్తలకు, ప్రేయసీ ప్రియులను ఏకం చేసేందుకు నేను జన్మించాను గాని దూరం చెయ్యడానికి కాదు. వారి బిడ్డలను దూరం చెయ్యడానికి జన్మించాను నేను. అలాగని వారి బిడ్డలను వారిష్టం లేకుండా దూరం చెయ్యడం నా అభిమతం కాదు.

అయితే ఏం చేస్తాం?

ఒక్కొక్కసారి నేను ఏ పని చెయ్యడానికి జన్మించానో ఆ పని చెయ్య లేకపోతున్నాను.

నేను అంత సిగ్గుపడవలసిన దాన్ని కాదు.

పురుషులకు అతి సన్నిహితంగా వుండే నన్ను పురుషులు ఆదరిస్తారు. తమ స్త్రీల కోసం ఉపయోగిస్తారు.

అయితే చాలా మందికి నన్ను ఉపయోగించుకోవడం సరిగా తెలియడం లేదు. తెలుసుకునే ప్రయత్నం చెయ్యడం లేదు కూడా! సిగ్గు పడుతున్నారు.

అంతెందుకు?


వైద్య రంగంలో వుండే మహిళా నర్సులు నన్ను ముట్టుకుంటారు, పట్టుకుంటారు గాని, నా గురించి చెప్పడానికి బిడియ పడతారు. అంత సిగ్గు పడవలసిన పని నేనేం చేస్తున్నాను చెప్పండి?


నా గురించి ధైర్యంగా ఎవరూ చెప్పడం లేదు. పత్రికల్లో ఈ మధ్య నా గురించి బాగా ప్రకటనలిస్తున్నారు. చాలా పత్రికల్లో నా గురించి వార్తలు కూడా రాస్తున్నారు. సంతోషంగా వుంది. అయితే నన్ను గురించి ఎవరికీ సదవగాహన లేదు. అదే బాధగా వుంది.

నేను స్త్రీ పురుషులిద్దరికీ చక్కని ఎంజాయ్ మెంట్ ఇస్తాను. అయితే నన్ను ఉపయోగించే విధంగా ఉపయోగించకుండా వాళ్ళ దగ్గర తప్పు పెట్టుకుని తప్పంతా నా మీద తోస్తే నాకు బాధ కలుగదా మరి?

టీనేజ్ లో వున్న వాళ్ళకీ, న్యూలీ మేరేజ్ చేసుకున్న వాళ్ళకి నేనెక్కువగా పరిచయమే.

బజార్లో, బస్సులపై నా పేరు ఈ మధ్య బాగా ప్రముఖంగా వినిపిస్తూనే వుంది. నాతో చాలా మంది వ్యాపారం చేస్తున్నారు. చాటు మాటు వ్యవహారాలు చేస్తున్నారు. సంపాదిస్తున్నారు. చింత తీర్చుకుంటున్నారు, సంతోషపడుతున్నారు. నేనంటే ఎవరో తెలియని అమాయకులు కూడా నాకు గాలి కొట్టి ఉబ్బిస్తున్నారు, వేలికి కడుతున్నారు, కాలికి కడుతున్నారు, వేలాడ దీస్తున్నారు, గేలి చేస్తు






న్నారు, పగల గొడుతున్నారు, పారవేస్తున్నారు.

టీనేజ్ వాళ్ళకీ నేనంటే ప్రాణం. గుర్రాల వంటి కుర్రకారు కోరికలకు కళ్ళాలు తీయించి, వాళ్ళ మనసులో వున్నది వేయించి వారికి సంతృప్తిని కలుగ వేస్తాను. కాని వాళ్ళే నన్ను ఎలా వాడుకోవాలో తెలియక నేను అన్ని విధాల బాగున్నానో లేదో చూడక వాడిన నున్న పదే పదే వాడుతూ నాతో జరిగే ఉపకారాన్ని అపకారంగా మార్చుకుంటూ అభాసుపాలవుతారు. అపహాస్యానికి గురి అవుతారు. అప్పుడప్పుడు ఆత్మహత్య కూడా వేసుకుంటారు.

కొత్తగా పెళ్ళయిన వాళ్ళు హనీమూన్ యాత్రలో వున్నప్పుదు - ఎవ్వరినీ దగ్గరికి రానివ్వరు గాని నన్ను రానివ్వక తప్పదు మరి. వారి కోరిక అవధులు దాటిన ప్రతిసారీ నన్ను దగ్గరికి తీస్తారు, హత్తుకుంటారు, అవసరమైన విధంగా వాడుకుంటారు, ఆ పైన వది లేస్తారు. అందుకే హనీమూన్ విహార యాత్రలో మూన్‌నీ నేనే హనీనీ నేనే. అన్నీ నేనే అన్నా అతిశయోక్తి లేదేమో.

ఒక్కొక్కప్పుడు అవధులు దాటిన ఆవేశంలో నన్ను గాయపరుస్తారు. అంత దూరంగా నన్ను తోడుగా తీసుకువెళ్ళిన వారికి నా ఉపయోగమే నిరుపయోగంగా మారుతోంది.

ఒక్కొక్కప్పుడు నాపై ఎక్కువ మక్కువ చూపి నన్ను దగ్గరికి తీసే ప్రయత్నంలోనే ప్రయాసకు గురియై అలసట చెంది నిరాశతో నీరుగారి పోతారు. అందుకే వాళ్ళకు చెప్పాలని వుంటుంది. వాళ్ళ పనిలో వాళ్ళు నిమగ్నమై పోతూ నున్న పరధ్యానంగానే దగ్గరికి తీస్తే మంచిదని, ఈ చిన్న విషయం తెలియక నాపై ఎక్కువగా ధ్యానం చూపించడం వల్లనే వారు చేసే పనిలో విజయవంతం కాలేకపోతారు. అదే మానసిక చింతన, బలహీనతలతో హనీమూన్‌ను అర నిమిషంలో ముగించుకుని పెళ్ళి వాకిట్లో పసుపు కుంకుమల చారలైనా చెరగక ముందే, పెళ్ళికి వచ్చిన చుట్టాలు వారి వారి ఇళ్ళకు తిరుగు ప్రయాణం కట్టక ముందే కొత్తగా పెళ్ళయిన జంట పెళ్ళింటికి తిరిగి వచ్చి అందరినీ ఆందోళనకు గురి చేస్తారు.

రసిక ప్రియులకు నేను ఆరోగ్య ప్రదాతను అన్న గట్టి నమ్మకం వుంది. అందుకే వారు ''బుజ్జిముండ..., పిచ్చిముండ'' అని ముద్దెట్టుకుంటూ ముచ్చట పడిపోతారు— రెచ్చి పోతారు. ముందూ వెనుకాల మందులేవీ వాడకున్నా నేనుంటే చాలు వాళ్ళకు యవ్వనమంతా నిత్యవసంతమేనన్న నమ్మకం. కాని, సీతాఫలం జిగురు మూతికన్నా ముందే చేతికే అంటుతుందన్న సత్యం గుర్తించరు. అందువల్ల నన్ను వాడక ముందే ''చేతులు చేసిన'' చిలిపి చేష్టల వల్ల మలినమైన ఆ చేతులతోనే నన్ను ఉపయోగించడం వల్ల ప్రయోజనం లేదన్న సంగతి వాళ్ళకి తెలియడం లేదు. అందుకే కంచు కవచంలా కాపాడ వలసిన నేను రక్షణ కల్పించ లేకపోతున్నాను. చదువుకున్న




వాళ్ళకే నేనిలా అవగాహన అయినప్పుడు చదువు లేని వాళ్ళకి నేను, నా ఉపయోగం అసలే అర్థం కావేమో.

అలాంటప్పుడు నా పేరు చెపుతూ, కనున్న అతి చిన్న కుటీరం చూపిస్తూ నా వల్ల ఆరోగ్య రక్షణ కలుగుతుందనీ అదనీ ఇదనీ అనడం న్యాయమేనా? మీరే చెప్పండి!

నా బాధంతా మీ ముందు వెళ్ళగక్కాను.

ఇది చదివిన మీరైనా నన్ను సద్వినియోగ పరిచే మార్గాన్ని ఆలోచించండి!

అరె! ఇంతకీ నా గోలంతా చెప్పాను గాని నా పేరేమిటో నేనెవరో చెప్పడం మర్చిపోయాను గదూ!

నా పేరు నిరోధ్!

డా: అలుకా జైహింద్ రెడ్డి
యం.ఏ; యం.డి.; యం.ఫిల్.; పి.హెచ్.డి. (ఎస్.టి.డి.)
ప్రొఫెసర్ అండ్ సివిల్ సర్జన్
ఉస్మానియా జనరల్ హాస్పిటల్,
హైదరాబాద్: 500 012.